సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం, 2, మే, 2023



లక్ష్యం చేరుకుంటేనే సంతృప్తి

పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేస్తారని, వారి కలలను నిజం చేస్తేనే సంతృప్తి లభిస్తుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు.

- 8లో



రక్తదాతకు జాతీయ స్థాయి గుర్తింపు

రక్తదానం చేయడంలో విజయనగరం జిల్లాకు చెందిన వ్యక్తికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం హర్షణీయమని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు.

- 8లో

ఈకేవైసీ తప్పనిసరి

పార్వతీపురం: పెన్షనర్లందరూ సీఎఫ్‌ఎంఎస్ ఐడీతో ఆధార్‌నంబర్‌కు ఫోన్ నంబర్‌ను అనుసంధానం చేయాలని జిల్లా ఖజానా అధికారి ఆరిక మన్మథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నాలుగు ఉప ఖజానా కార్యాలయాల ద్వారా పెన్షన్లు పొందుతున్న వారందరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఉప ఖజానా కార్యాలయాల పరిధిలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో ఈకేవైసీ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

న్యూస్‌రీల్

రోగులకు భోజన సదుపాయం



రోగులకు భోజనాలు వడ్డిస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

సీతంపేట: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి రోగులకు సోమవారం నుంచి భోజన సదుపాయం కల్పించారు. ప్రతిరోజు రోగితో పాటు సహాయకులకు రుచికరమైన భోజనం వడ్డిస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. తొలిరోజు 70 మందికి భోజనాలు వడ్డించామన్నారు. గర్భిణులు, చిన్నారులకు ప్రత్యేక మెనూ అమలు చేస్తామని చెప్పారు.


భూముల రీసర్వే పరిశీలన



శిఖబడిలో రీసర్వే పనులు పరిశీలిస్తున్న పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడిలో నిర్వహిస్తున్న భూముల రీసర్వే తీరును పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ సోమవారం పరిశీలించారు. కొలతలు, హద్దురాళ్ల ఏర్పాటు తదితర వివరాలను తహసీల్దార్ కె.వి. సీతారామయ్యను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ఎటువంటి తగాదాలకు తావులేకుండా ఉండాలన్నారు.

దాడితల్లికి 108 కిలోల లడ్డూ నైవేద్యం



దాడితల్లికి నైవేద్యంగా సమర్పించేందుకు సిద్ధం చేసిన 108 కిలోల లడ్డూ

బొబ్బిలి: పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం జరగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా పులిహోరాతో పాటు 108 కిలోల లడ్డూను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించనున్నారు. లడ్డూ ప్రసాదాన్ని అమ్మవారి సన్నిధిలో ఉంచి సిరిమానోత్సవం సందర్భంగా భక్తులకు పంపిణీ చేయనున్నామని అర్చకులు పిండిప్రోలు మణికుమార్‌శర్మ తెలిపారు.

అకాల వర్షాలతో ఆందోళన



ఉద్దవోల్లో నువ్వు పంటను టార్పాలిన్లతో కప్పిన రైతులు

గరుగుబిల్లి: అకాల వర్షాలతో రైతులు సర్వత్రా ఆందోళన చెందుతున్నారు. గరుగుబిల్లి మండలంలోని గరుగుబిల్లి, ఉద్దవోలు, పెద్దూరు, బీవీపురం తదితర గ్రామాల్లో నువ్వుపంట కోతకు వచ్చింది. ఈ సమయంలో కురిసిన వర్షాలతో పంట పాడవుతుందని రైతులు చెబుతున్నారు. కోసిన చేనును దిబ్బలుగా చేర్చి టార్పాలిన్లతో కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

10న జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ సంయుక్తంగా టెక్-బి ప్రోగ్రామ్‌కు సెలక్షన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి యు.సాయికుమార్, డీఈఈఓ మంజుల వీణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ 2021–2022లో 60 శాతం, 2022–2023లో 75 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు జాబ్‌మేళాకు అర్హులుగా పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి పార్వతీపురంలోని వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందన్నారు. ఈ డ్రైవ్‌కు హెచ్‌సీఎల్ టెక్నాలజీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9182398325 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అల భోగాపురంలో...

- నాడు నా(రా)టకం.. నేడు జగ'నిజం'
- భోగాపురం విమానాశ్రయానికి నాటి చంద్రబాబు శంకుస్థాపన బూటకం
- తామే చేశామని 2019 సార్వత్రిక ఎన్నికల్లో చెప్పుకోవడానికి తూతూమంత్రంగా కార్యక్రమం
- శిలాఫలకం ఆవిష్కరించిన భూమితోసహా భూసేకరణ ప్రక్రియ వివాదాస్పదం
- కోర్టుల్లో వందల పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నా టెంకాయ కొట్టేసిన వైనం
- నాడు మోదీ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నా కానరాని అనుమతులు
- అంతా నాటకమని తెలిసే భూమిపూజకు జిల్లా టీడీపీ నాయకుడు అశోక్ డుమ్మా!
- అనుమతులన్నీ తెచ్చింది, అడ్డంకులన్నీ తొలగించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనకు ఏర్పాట్లు
- ప్రజల దృష్టి మరల్చడానికి టీడీపీ నాయకుల పాట్లు



2023 మే 3: వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి కార్యరూపం తీసుకొచ్చేందుకు నడుంబిగించారు. దీనికోసం త్రిముఖ వ్యూహం అనుసరించారు. ఇక్కడ 2,751 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయించారు. మరోవైపు రైతులకు తగిన నష్టపరిహారం, నిర్వాసితులకు పునరావాసం విషయంలో తన ఉదారతను చాటుతూ వారిని ఒప్పించారు. హైకోర్టు, సుప్రీం కోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్లన్నీ పరిష్కారమయ్యేలా చొరవ చూపించారు. అదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా కేంద్ర మంత్రులను తరచుగా సంప్రదిస్తూ విమానాశ్రయానికి అవసరమైన అనుమతులన్నీ సాధించారు. అలా అడ్డంకులన్నీ అధిగమించడానికి, అనుమతులన్నీ తేవడానికి నాలుగేళ్ల కాలం పట్టింది. ఇక మార్గం సుగమమైన నేపథ్యంలో రానున్న రెండేళ్లలో నిర్మాణం పూర్తిచేసి, మూడో ఏట పూర్తిస్థాయిలో విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలను నిర్వహించాలనేది లక్ష్యం. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆ మరుక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు జీఎంఆర్ సిద్ధంగా ఉంది. ఉమ్మడి విజయనగరం జిల్లా సహా ఉత్తరాంధ్ర దశాదిశా మార్చేసే, రాష్ట్రంలో బహుముఖ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు దోహదం చేసే



భోగాపురం విమానాశ్రయ ఊహాచిత్రం ఇది.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి గత చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్ల పాలనాకాలంలో చేసిదేమిటో, ఈ నాలుగేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాధించిందేమిటో రికార్డు ఆధారాలు ఉన్నాయి. కానీ ప్రజల దృష్టిని మరల్చేందుకు టీడీపీ నాయకులు నానా పాట్లు పడుతున్నారు. కనీసం ఏ భూమిలో వేస్తున్నామో చూడకుండా శిలాఫలకం వేసేసి టెంకాయ కొట్టే మమ అనిపించిన చంద్రబాబుదే ఘనత అంటూ డబ్బా కొట్టుకోవడం వారికే చెల్లిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ప్రస్తుత విశాఖ విమానాశ్రయాన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మార్పు చేయడానికి వీల్లేని పరిస్థితుల్లో భోగాపురం వద్ద విమానాశ్రయం నిర్మించాలనే ప్రతిపాదన 2015 సంవత్సరంలో తెరపైకి వచ్చింది. గత టీడీపీ ప్రభుత్వం భూసేకరణకు బీజం వేసింది. 15 వేల ఎకరాలు సేకరిస్తామనడంతో భోగాపురం మండల రైతులు ఆందోళనలకు దిగారు. దీంతో ఐదు వేల ఎకరాలకు దిగొచ్చింది. పరిహారం ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున ప్రకటించడం, అసైన్డ్ భూములకు విస్మరించడంతో 2015 ఆగస్టులో రైతులు రోడ్డెక్కారు. అడ్డదిడ్డంగా తలపెట్టిన భూసేకరణను సవాలు చేస్తూ కొంతమంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. వాటిపై విచారణ పెండింగ్‌లో ఉండగానే 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపించాయి. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం ఏమీ పూర్తి చేయలేదు. ఏదిఏమైనా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఘనత తనదేనని చాటుకోవాలని ప్రచారయావతో చంద్రబాబు 2019 ఫిబ్రవరి 14వ తేదీన హడావుడిగా శంకుస్థాపన చేయడం అప్పట్లో విమర్శలకు దారితీసింది.

భోగాపురం పోర్ట్ పనులు ఇలా..

విమానాశ్రయ విస్తీర్ణం	2,203 ఎకరాలు
నిర్మాణ వ్యయం	రూ.4,592 కోట్లు
నిర్మాణ సంస్థ	జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్
విధానం	డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం)
పూర్తి సామర్థ్యం	ఏటా 4 కోట్ల (40 మిలియన్ల) మంది ప్రయాణికుల రాకపోకలకు వీలు
తొలి దశ	ఏటా 60 లక్షలు (6 మిలియన్ల) మంది ప్రయాణికుల రాకపోకలకు సౌకర్యం
రన్‌వే పొడవు	3.8 కిలోమీటర్లు
అదనపు ప్రత్యేకత	దాదాపు 5వేల చదరపు గజాల విస్తీర్ణంలో దేశీయ, అంతర్జాతీయ కార్గో టెర్మినల్
ఉపాధి	ప్రత్యక్షంగా లక్ష మందికి, పరోక్షంగా 5 లక్షల మందికి

ఫలించిన జగన్‌మోహన్‌రెడ్డి శ్రమ...

విమానాశ్రయానికి అవసరమైన అనుమతుల కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ స్థాయిలో చేసిన ప్రయత్నాలు ఫలించాయి. మరోవైపు క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నారు. విమానాశ్రయ నిర్వహణకు, ఇతర అనుబంధ కార్యకలాపాలకు 2,750.78 ఎకరాలు సరిపోతాయని నిర్ణయించారు. పరిహారాన్ని భూమి పరిస్థితిని బట్టి ఎకరాకు రూ.28 లక్షల నుంచి రూ.36 లక్షల వరకూ అందించారు. అసైన్డ్ భూములకు కూడా జిరాయితీ భూమితో సమానంగా పరిహారం మంజూరు చేశారు. మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, భోగాపురం మండల నాయకుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి తదితరులు జరిపిన చర్చలతో చాలామంది రైతులు సానుకూలంగా స్పందించారు. కోర్టుల్లో పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. మిగిలిన పిటిషన్లను హైకోర్టు, సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్ పరిష్కరించాయి. నిర్వాసితులైన నాలుగు గ్రామాల్లోని 404 కుటుంబాలకు అత్యుత్తమమైన పునరావాసప్యాకేజీని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించింది. దాదాపు రూ.80 కోట్ల వ్యయంతో టౌన్‌షిప్‌లను తలదన్నేలా రెండు కాలనీలను వారికోసం నిర్మించింది.



2019 ఫిబ్రవరి 14: భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవిష్కరించిన శిలాఫలకం ఇది. ఐదేళ్ల పాలనా కాలంలో చేసిందేమీ లేకపోయినా సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా రెండు నెలల ముందు తూతూమంత్రంగా నిర్వహించిన కార్యక్రమం ఇది. నాటికి భూసేకరణ ప్రక్రియ కొలిక్కిరాలేదు. ఆ శిలాఫలకం వేసిన స్థలం సహా అంతా వివాదాస్పదమే. వందకు పైగా రైతులు వేసిన పిటిషన్లు కోర్టు విచారణలోనే ఉన్నాయి. నిర్వాసితులకు ఓ దారి చూపించలేదు. విమానాశ్రయం నిర్మాణానికి కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి అనుమతులేవీ రాలేదు. ఇదంతా ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఆడుతున్న నాటకమని తెలిసే జిల్లా టీడీపీ నాయకుడు, మోదీ ప్రభుత్వంలో విమానయాన శాఖ మంత్రిగా పనిచేసిన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఆ కార్యక్రమానికి ముఖం చాటేశారు.

అత్యాధునికంగా నిర్మాణం...

దాదాపు రూ.790 కోట్ల ఖర్చుతో సేకరించిన 2,750 ఎకరాల భూమిని ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థకు బదలాయించింది. అందులో విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన 2,203 ఎకరాలను నోటిఫై చేస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. రాజాం ప్రాంత వాసి, ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావుకు చెందిన జీఎంఆర్ గ్రూప్ నిర్మాణ బాధ్యతలు తీసుకుంది. ఈ నెల 3వ తేదీన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి భూమిపూజ చేయనున్నారు.

గడపగడపకూ సంక్షేమ పాలన



గిరిజనలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర

- ఆంధ్రా–ఒడిశాల మధ్య స్నేహపూర్వక వాతావరణం కొనసాగిద్దాం
- జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనులకు ప్రగతి ఫలాలు
- టీడీపీ నాయకుల బూటకపు మాటలు నమ్మొద్దు
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు:

గిరిజన సంక్షేమమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రతి గడపకూ సంక్షేమపాలనను చేరువచేసిందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు మండలంలోని గిరిశిఖర గ్రామాలైన పట్టుచెన్నేరు, పగులుచెన్నేరు పంచాయతీల్లో సోమవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమపాలనను వివరించారు. నాలుగేళ్లుగా అందజేసిన పథకాల లబ్ధిని తెలియజేశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి, ఆయన కుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే గిరిజన ప్రాంతాల్లో ముమ్మరంగా రోడ్లు, వంతెనలు వంటి అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కరోనా వంటి క్లిష్టపరిస్థితుల్లో అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచిందని, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేసిందన్నారు. మన్యంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయన్నారు. ఎవరి హయాంలో ఆర్థిక లబ్ధి కలిగిందో గుర్తించాలన్నారు. ఎన్నికలవేళ టీడీపీ నాయకులు చెప్పే అబద్ధపు మాటలను నమ్మొద్దన్నారు. గిరిజనుల అభివృద్ధిపై మాట్లాడే నైతికహక్కు టీడీపీకి లేదన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద ప్రధాన్ ఇటీవల కొటియా గ్రామాలపై చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. కొటియా వివాదంపై సుప్రీంకోర్టులో స్టేటస్‌కో అమలులో ఉందని, సుప్రీం తీర్పుకు అనుగుణంగా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఆంధ్రా–ఒడిశాల మధ్య స్నేహపూర్వక వాతావరణం కొనసాగాలని తాము కోరుకుంటున్నామని పునరుద్ఘాటించారు.

ప్రతి ఆదివారం విహారయాత్ర స్పెషల్



టీవీఎస్ సుధాకర్

పార్వతీపురంటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో వేసవి సెలవుల దృష్ట్యా మే, జూన్ నెలల్లో పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలు చేసేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ సోమవారం తెలిపారు. ఒకే రోజున వైష్ణవ క్షేత్రాలైన అరసవల్లి, శ్రీకూర్మం పుణ్యక్షేత్రాలను దర్శించుకొనేలా, కళింగపట్నం బీచ్‌లో విహరించేందుకు ప్రతీ ఆదివారం ఉదయం 6 గంటలకు పార్వతీపురంలో బస్సు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు తిరిగి చేరేలా ప్యాకేజీ టూర్‌ను రూపొందించామన్నారు. దీనికి పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.270లు చార్జీ చెల్లించాలన్నారు. ఆసక్తిగల వారు ఏపీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్.ఇన్‌లో టికెట్లను బుక్‌చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం డిపో మేనేజర్ సెల్: 99592 25621, అసిస్టెంట్ మేనేజర్ 99631 98520 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఠంచన్‌గా పింఛన్

ఓ వైపు చిరుజల్లులు.. మరో వైపు మేడే వేడుకల నడుమ.. నెలలో మొదటితారీఖు సోమవారం ఉదయమే వలంటీర్లు పింఛన్‌దారుల తలుపు తట్టారు. అర్హులందరికీ పింఛన్లు అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 1,40,077 మంది లబ్ధిదారుల పింఛన్ల కోసం ప్రభుత్వం రూ.38.41 కోట్లు కేటాయించగా, తొలిరోజు 84 శాతం మందికి పింఛన్లు అందజేసినట్టు డీఆర్‌డీఏ పీడీ పి. కిరణ్‌కుమార్ తెలిపారు. – పార్వతీపురంటౌన్



పార్వతీపురం మండలంలో లబ్ధిదారు కనకమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గౌరి



పార్వతీపురం 4వ వార్డులో అంకల రామారావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గాయత్రి



పార్వతీపురం పట్టణంలోని ఉణ్ణ భాస్కరరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కుమార్



పాలకొండ రూరల్‌లో లబ్ధిదారు కె.గౌరుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శేఖర్

శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు



విగ్రహాలను శుద్ధిచేస్తున్న వేదపండితులు



ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు



మహిళల కోలాట ప్రదర్శన

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సీతంపేటలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడోరోజు సోమవారం మహాసంప్రోక్షణ జరిపారు. పంచగవ్యప్రాసన, పుణ్యాహవచనం, వాస్తుహోమం, అకల్మష ప్రాయిశ్చిత్త హోమం, రక్షాబంధనం, హారతి, ప్రసాద వినియోగం, అగ్నిప్రతిష్ట, కుంభారాధన, విశేషహోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు మాట్లాడుతూ బింబ శుద్ధి కోసం పంచగవ్యాధివాసం నిర్వహించినట్టు తెలిపారు. ముడిశిలను శిల్పులు చాకచక్యంగా స్వామి, అమ్మవార్ల విగ్రహాలుగా మలుస్తారని, ఈ క్రమంలో సుత్తి, ఉలి దెబ్బలకు వేదనకు గురయ్యే విగ్రహాలకు ఉపశమనం కలిగించేందుకు పాలు, పెరుగు, నెయ్యి, గోమయం, గోమూత్రంతో అభిషేకం చేశామన్నారు. పూజల్లో కంకణబట్టార్ శేషాచార్యులు, డిప్యూటీ ఈఓలు వెంకటయ్య, శివప్రసాద్, ఈఈ సుధాకర్, ఏఈఓ రమేష్, డిప్యూటీ ఈఈలు ఆనందరావు, నాగరాజు, జేఈ రవికుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. మహిళలు కోలాట ప్రదర్శనలతో భక్తులను అలరించారు.

– సీతంపేట

క్లుప్తంగా

రేషన్ డిపోలో తనిఖీ



రేషన్ డిపోలో తనిఖీ చేస్తున్న ఏఎస్ఓ అశోక్‌కుమార్, సీఎస్‌డీటీ ఇందిర

జామి: స్థానికుల ఫిర్యాదు మేరకు మండలంలోని అలమండ రేషన్ డిపో 29లో ఏఎస్ఓ బి.అశోక్‌కుమార్, సీఎస్‌డీటీ ఇందిర సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో బియ్యం 41.80 క్వింటాళ్లు, పంచదార 60.5 కేజీలు తేడా ఉన్నట్లు గుర్తించారు. డీలర్ దాసరి గాంధీపై 6 ఎ కేసు నమోదు చేసి స్టాక్‌ను 35 డిపో డీలర్ శారదకు అప్పగించినట్లు పౌరసరఫరాల అధికారులు తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి



అప్పయ్యమ్మ మృతదేహం

పార్వతీపురం: పట్టణంలోని దీప్తి లాడ్జి సమీపంలో బైక్ ఢీకొనడంతో ఓ వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. ఈ ప్రమాదంపై అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన వంగపండు అప్పయ్యమ్మ (78) దీప్తి లాడ్జి సమీపంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది.

ఎస్టీలకు మూడు సీట్లు ఖాళీ

విజయనగరం పూల్‌బాగ్: నగరంలోని బాబామెట్టలోగల కేంద్రీయ విద్యాలయంలో ఒకటవ తరగతిలో ఎస్టీ కేటగిరికి సంబంధించి మూడు సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 9వతేదీలోగా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు విద్యాలయం http://vizianafaram.kvr.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

విజయనగరం: పదవ తరగతి దాటిన విద్యార్థులకు దరఖాస్తుతో సంబంధం లేకుండానే కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయడం ఒక మంచి ప్రయత్నమని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పైకి చిన్న విషయంగా కనబడుతున్నా కుల ధ్రువీకరణ పత్రాలు సంపాదించడానికి ఆయా వర్గాలు, ప్రత్యేకించి పేదలు, ఆదివాసీలు, దళితులు ఎంత కష్టపడాల్సి వస్తుందో చెప్పనలవి కాదన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తి చేసి పై చదువు కోసం దరఖాస్తు చేస్తే కులధ్రువీకరణ పత్రం జత చేయడం తప్పనిసరని, అటువంటి కీలకమైన ధ్రువపత్రాలు సులభంగా అందించే నిర్ణయం తీసుకోవటం అభినందనీయమన్నారు. 40 లక్షల కుటుంబాలకు, 10 లక్షల మంది పదవ తరగతి విద్యార్థులకు అడగకుండానే వారి కుల ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచడం, అందించడం గొప్పమేలు చేసే కార్యక్రమమని పేర్కొన్నారు.

స్పందన వినతులు త్వరగా పరిష్కరించాలి



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

పార్వతీపురం: స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన వినతులను పెండింగ్‌లో ఉండకుండా సత్వరమే పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఆయన స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 40 అర్జీలను స్వీకరించారు. ఉపాధి హామీ పథకంలో పని అడిగిన వెంటనే పనులు కల్పించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.జగన్నాథ రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి కేవీఎల్ఎన్. మూర్తి, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎ.ఈశ్వర రావు, జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ పి.వెంకటేశ్వరరావు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. రఘురాం తదితరులు పాల్గొన్నారు.

వినతులలో కొన్ని...

గ్రామానికి బీటీ రోడ్డు, ఇంటింటికి మంచినీటి కుళాయిలు లేకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఇంతవరకు పనులు ప్రారంభించలేదని కురుపాం మండలం ఎగువ కొత్తగూడకు చెందిన గ్రామస్తులు అర్జీ అందజేశారు.

- పార్వతీపురం మండలం పెదమరికి గ్రామంలో పాత కాలనీకి విద్యుత్, తాగునీరు సదుపాయం కల్పించాలని కె.శ్రీను కోరారు.
- సీతంపేట మండలం గడిగుడ్డి గ్రామ గిరిజన రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ భూముల మీదుగా 33, 11 కేవీ విద్యుత్ లైన్లు వెళ్తున్నాయని, రెండు లైన్లు ప్రమాదకరమైనవి కావడంతో వ్యవసాయం చేసే సమయంలో ప్రాణ భయంతో గడపాల్సి వస్తోంది. విద్యుత్ లైన్లను రోడ్డుకు ఇరువైపులా మార్చాలని గ్రామ సర్పంచ్ ఎస్.విజయకుమారి, రైతులు వినతి పత్రం సమర్పించారు.
- పార్వతీపురం గ్రామ రెవెన్యూలో ప్రవహిస్తున్న వరహాలగెడ్డ నీటిపై చాలా మంది రైతులు ఆధారపడి ఉన్నారని, పార్వతీపురం మున్సిపాలిటీ డ్రైనేజీ ద్వారా చెత్త ప్లాస్టిక్ వరహాల గెడ్డలో పేరుకుపోతోందని, వర్షాకాలం సమయంలో ఆ చెత్తంతా వ్యవసాయ భూములపై కలుషిత చెత్తగా పేరుకుపోతున్న కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారని కె.వాసు దరఖాస్తు అందజేశారు.

గడువులోగా ఫిర్యాదులకు పరిష్కారం

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలపై స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. పోలీసు అధికారులు తమ పరిధిలో గల సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన నివేదికలను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, దిశ డీఎస్పీ ఎస్ఆర్ హరిత, ఏఆర్‌డీఎస్పీ బి. నాగేశ్వర రావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ ప్రభాకర్, ఎస్సై పి.దినకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం చేరుకుంటేనే సంతృప్తి



విద్యార్థికి నియామక పత్రం అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- విద్యకు ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం రూరల్: పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేస్తారని, వారి కలలను నిజం చేయడమే కాకుండే, విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధిస్తేనే వారికి సంతృప్తి లభిస్తుందని ఏపీ శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. స్థానిక పూల్‌బాగ్‌లోని ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో కోర్సు పూర్తి చేసుకున్న 50 మంది విద్యార్థులు వివిధ సంస్థలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి నియమాక పత్రాలను కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి కోలగట్ల ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు తగ్గట్లుగా ప్రభుత్వ కళాశాలల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. డిప్లమో పూర్తయిన వెంటనే 19 ఏళ్లకే ఉద్యోగం సాధించడం గొప్ప విషయమని ప్రశంసించారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు విధుల్లో చేరి, అంకితభావం, నిబద్ధతతో పని చేసి సంస్థకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. తద్వారా జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. అప్పుడే మరిన్ని సంస్థలు ఈ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడానికి ముందుకు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్య జాయింట్ సెక్రటరీ జానకిరామయ్య, కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి, శిక్షణ ప్లేస్‌మెంట్ అధికారి సీవీ రమణమూర్తి, స్టూడెంట్ అడ్వైజర్ ఎస్‌వీ రమణ, కార్పొరేటర్ బి.ఆనంద్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 80 అర్జీలు



వినతులను స్వీకరిస్తున్న డీఆర్ఓ ఎం.గణపతిరావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న దిశ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు

- వర్షం కారణంగా రాలేకపోయిన అర్జీదారులు

విజయనగరం అర్బన్: కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంపై వర్షం ప్రభావం చూపింది. ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించే ఈ కార్యక్రమానికి ప్రతి సోమవారం సుమారు 300 వరకు వినతులు వచ్చేవి. అయితే ఈ వారం ఉదయం నుంచి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న చిరుజల్లుల వల్ల కేవలం 80 అర్జీలు మాత్రమే వచ్చాయి. వాటిలో అత్యధికంగా వ్యసాయభూములు, స్థిరాస్తుల ఆక్రమణలపై ఉన్నాయి. విజయనగరం నియోజకవర్గం పరిధిలోని భూ ఆక్రమణల(అక్రమ మ్యూటేషన్) పై ప్రతి సోమవారం స్పందనలో వినతులు వస్తున్నా సంబంధిత మండల రెవెన్యూ అధికారులు, జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పందించడం లేదని అర్జీదారులు వాపోతున్నారు. మొత్తం 80 వినతులలో సగానికి మించి 48 వినతులు రెవెన్యూ విభాగానికి సంబంధించినవే ఉన్నాయి. హౌసింగ్ 3, వార్డు సచివాలయాలపై 12, వైద్యారోగ్య శాఖ 6, డీఆర్‌డీఏ 3, మిగిలినవి ఇతర శాఖలకు చెందిన వినతులు ఉన్నాయి. కార్యక్రమంలో డీఆర్ఓ ఎం.గణపతి రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఫిర్యాదులపై తక్షణ చర్యలు

విజయనగరం క్రైమ్: స్పందనలో వచ్చే ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టినట్లు దిశ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు 22 ఫిర్యాదులను బాధితుల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

విజయవాడకి చెందిన ఒక వ్యక్తి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ. 14 లక్షలు తీసుకున్నాడు. ఇంతవరకూ ఎటువంటి ఉద్యోగం కల్పించలేదని, డబ్బులు తిరిగి ఇవ్వలేదని న్యాయం చేయా లని రాజాంకు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశాడు. గ్రామంలో బస్టాప్ కోసం వినియోగిస్తున్న స్థలంలో కొంతమంది వ్యక్తులు షాపులు నిర్మిస్తున్నారని, తాను ప్రశ్నిస్తే దుర్భాషలాడుతున్నారని జామి మండలం జాగరానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది.

పార్వతీపురానికి చెందిన వ్యక్తి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేశాడని, పెళ్లికి నిరాకరిస్తున్నాడని మెంటాడ మండలానికి చెందిన యువతి ఫిర్యాదు చేసింది.

రక్తదాతకు జాతీయ స్థాయి గుర్తింపు



రామకృష్ణారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సురేష్ బాబు

- హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్సీ సురేష్‌బాబు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం చేయడంలో విజయనగరం జిల్లాకు చెందిన వ్యక్తికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం హర్షణీయమని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. స్థానిక రెవెన్యూ కల్యాణ మంటపంలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత మాజీ వాయు సైనికుడు, ఉపాధ్యాయుడు బి. రామకృష్ణారావు 175 వసారి రక్తదానం చేసి జాతీయ స్థాయిలో పేరు తెచ్చు కోవడం అభినందనీయమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత పెద్ద ఎత్తున రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని రక్తదానం చేసి ఎందరికో ప్రాణదాతలుగా నిలవాలని అకాక్షించారు. రక్తదాత రామకృష్ణారావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో హోల్ బ్లడ్ రికార్డులో జమ్మూకు చెందిన మహమ్మద్ హుస్సేన్ ఖాన్ 174వ సారి రక్తదానం చేసినట్లు గూగుల్‌లో చూపిస్తోందన్నారు. దాని ఆధారంగా తాను 175వ సారి రక్తదానం చేసి జాతీయ స్థాయి రికార్డు నెలకొల్పానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అవనాపు విక్రమ్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి మజ్జి కృష్ణారావు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 430.00
విజయనగరం	రూ. 434.00
శ్రీకాకుళం	రూ. 434.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,760–00
బంగారం(22సి. 10గ్రా.)	55,700–00
వెండి (కిలో)	80,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹127	₹224	₹ 234

కలెక్టరేట్ వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నం



కలెక్టరేట్ ప్రాంగణంలో ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి

విజయనగరం అర్బన్: విజయనగరం కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం ఘటన కలకలం రేపింది. అద్దం గాజుముక్కతో మెడపై గాయం చేసుకొని రక్తం మడుగులో అక్కడికక్కడే కూలిపోయాడు. వివరాల్లోకి వెళితే... కలెక్టరేట్‌లోని ఇన్‌సైడ్ పార్క్ ప్రాంగణంలో ఉదయం 8.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి రక్తం మడుగులో నేలపై పడి ఉండడాన్ని నైట్ డ్యూటీలో ఉన్న అటెండర్ చూసి ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన గొంతుకు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఆయన పేరు వీర్కుమార్ అలియాస్ సన్నీ, తండ్రి దసాహిడోరా అనియా, బిలంగపదర్ గ్రామం, రాయగడ మండలం, ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కలెక్టరేట్‌లో స్పందనలో వినతులు అందజేసేందుకు వచ్చిన వ్యక్తికాదని, వ్యక్తిగత సమస్యలే కారణం కావచ్చని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

రేషన్ పంపిణీ పరిశీలన

విజయనగరం రూరల్: కార్పొరేషన్ పరిధిలోని కే.ఎల్.పురంలో రేషన్ పంపిణీని కేంద్ర బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. రేషన్ సరుకులు, వాటి నాణ్యత పరిశీలనతో పాటు లబ్ధిదారులతో మాట్లాడారు. సరుకుల పంపిణీ తీరుపై ఆరా తీశారు. వారి వెంట పౌర సరఫరాల శాఖ డీఎం మీనా కుమారి, మండల సీఎస్‌డీటీ వీవీఆర్ జగన్నాథం ఉన్నారు.

గాజు ముక్కలు మింగి..



చికిత్స పొందుతున్న దారుల్లి

పార్వతీపురం: భర్త మందలించడాని మనస్తాపం చెందిన ఓ మహిళ గాజు ముక్కలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సోమవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలం కొసగూడ గ్రామానికి చెందిన బి.దారుల్లిని భర్త మల్లేశ్వరరావు మందలించాడని మనస్తాపం చెంది చేతికి ఉన్న నాలుగు గాజులను చితక్కొట్టి మింగేసింది. ఈ విషయం భర్త చూసి గుమ్మలక్ష్మీపురం ఆస్పత్రికి ఆమెను తరలించగా ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మద్యం తాగవద్దన్నందుకు..



చికిత్స పొందుతున్న పున్నయ్య

పార్వతీపురం: మద్యం తాగవద్దని భార్య మందలించినందుకు మనస్తాపం చెందిన భర్త లైజాల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వీరఘట్టం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన జి.పున్నయ్య తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. తాగుడు మానమని భార్య రమ్య ఒత్తిడి చేయడంతో ఇంట్లో ఉన్న లైజాల్‌ను తాగేశాడు. విషయం గమనించి కుటుంబసభ్యులు చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జాతీయ టెన్నిస్ పోటీల్లో వెటరన్స్ సత్తా



అనకాపల్లిలో జరిగిన పోటీల్లో రామారావు, ఎంవీఎల్ఎన్ రాజుఅనకాపల్లిలో జరిగిన పోటీల్లో రామారావు, ఎంవీఎల్ఎన్ రాజు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరిగిన టెన్నిస్ పోటీల్లో విజయనగరం వెటరన్ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. గత నెలలో భీమవరం, విశాఖపట్నం ప్రాంతాల్లో జరిగిన ఆలిండియా సీనియర్ టెన్నిస్ చాంపియన్ షిప్, గ్లోబల్ సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం క్రీడాకారులు సన్యాసిరాజు, ఎంవీఎల్ఎన్ రాజు, రామారావు, మధు, సుధ, భాను టైటిల్ సొంతం చేసుకున్నారు. తాజాగా బెంగళూరులో ఏప్రిల్ 30న జరిగిన ఆలిండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సామిత్రి 45 సంవత్సరాల వయస్సులో డబుల్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. అలాగే అనకాపల్లిలో జార్జ్ క్లబ్ నిర్వహించిన ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో రామారావు, ఎంవీఎల్ఎన్ రాజు జోడి మొదటి స్థానంలో విజేతలుగా నిలిచారు. రెండు జాతీయ స్థాయి టోర్నమెంట్‌లలో విజయనగరం క్రీడాకారులు సత్తా చాటడంతో జిల్లా టెన్నిస్ అసోషియేషన్ ఆనందం వ్యక్తం చేసింది. క్రీడాకారులకు అభినందనలు తెలియజేసింది.

ఊపిరితిత్తుల బాధితుడికి ప్రభుత్వ సాయం

- రూ.5లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే జోగులు



రవికుమార్, కుటుంబీకులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



మూలపేట వద్ద సీఎంను కలిసేందుకు వచ్చిన రవికుమార్ (ఫైల్)



రవికుమార్ దీనస్థితిపై సాక్షిలో ప్రచురితమైన కథనం

రాజాం: పట్టణంలోని సారథి గ్రామానికి చెందిన ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న వంజరాపు రవికుమార్‌కు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది. ఏప్రిల్ 19న శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు శంకుస్థాపనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రేగిడి మండలం వావిలవలస గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్దార్థ సాయంతో బాధితుడు రవికుమార్ కలుసుకున్నారు. ప్రతిరోజూ ఆక్సిజన్ వెంటిలేటర్ ఉంటేగాని జీవించలేని రవికుమార్ పరిస్థితితో పాటు తల్లిదండ్రులు కమల, రామ్మూర్తిలు పడుతున్న ఇబ్బందులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాలూరి సిద్దార్థ వివరించారు. వెంటనే స్పందించిన సీఎం అక్కడే ఉన్న తన వ్యక్తిగత కార్యదర్శులకు రవికుమార్‌కు ప్రభుత్వ సాయం అందించాలని, మెరుగైన వైద్యం చేయించాలని ఆదేశించారు. పదిరోజుల వ్యవధిలో సీఎంఓ నుంచి రాజాం తహసీల్దార్ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి. రవికుమార్ ఆరోగ్య పరిస్థితిపై నివేదికలు తీసుకుని, రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా విడుదలచేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం రాజాంలోని పార్టీ కార్యాలయం వద్ద రవికుమార్‌కు అతని కుటుంబీకుల సమక్షంలో రూ.5 లక్షల చెక్కును అందించారు. సీఎంను కలిసిన వెంటనే సాయం అందించడంపై రవికుమార్ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌భాస్కర్, వైఎస్ఆర్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంగర కన్వీనర్ కరణం సుదర్శనరావు, వంజరాపు విజయ్‌కుమార్, దూబ గోపాలం, కిల్లారి శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త పాలూరి సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

సాక్షితో వెలుగులోకి..

వంజరాపు రవికుమార్ ఆరోగ్య పరిస్థితిని సాక్షి పత్రిక వెలుగులోకి తీసుకొచ్చింది. ఆగస్టు1, 2022లో 'పేదింట పెద్దకష్టం' పేరుతో కథనం ప్రచురించింది. అప్పట్లో చాలా మంది దాతలు రవికుమార్‌కు ఆర్థిక సాయం అందించారు. అనంతరం కొంతమంది స్వచ్ఛంద కార్యకర్తలు రవికుమార్‌ను పలు ఆస్పత్రులకు వైద్యం నిమిత్తం తరలించారు. చివరకు పాలూరి సిద్దార్థ సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో రవికుమార్‌కు ప్రభుత్వసాయం అందింది.